


# టేకిట్ ఈజీ!! - 3

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## -8-

# క్రమశిక్షణ

క్రమ శిక్షణ అనగానే నాకు మా కాంతాలత్తయ్య గుర్తొస్తుంది. ఎందుకా? ఎందుకో నాకూ తెలియదు. గుర్తొస్తుంది. అంతే. పెతీ దానికీ లాజిక్కులడక్కండి చి..రా...గ్గా. అది మీరు నేర్చుకోవలసిన మొదటి విషయం. ఇంకపోతే రెండో విషయం. నాకు తెలియగానే మీకు చెబుతాను.

ఇంతకీ క్రమ శిక్షణ యనగా, క్రమము కొరకు శిక్షణా, క్రమమునందు శిక్షణా, క్రమము యొక్క శిక్షణా? మనకు తెలియదు. మనకి తెలిసిందల్లా ఒక్కటే. అయాంబాబుగారికి లేని వాటిలో మొదటిది క్రమ శిక్షణ. కావాలంటే శబ్దార్థ నిఘంటువు చూడండి. "క్రమశిక్షణ = శీనిగాడికి లేనిది" అని వుంటుంది. ఏంటి? ఆ నిఘంటువు మీదగ్గిర లేదా? అది మీ ప్రోబ్లం. సరే, ఇంతకీ మనకి లేనిదాని గురించి ఎందుకు మొదలెట్టామని ఊ..ఇదై పోకండి. మనకున్న తొస్సి పళ్ళూ, డొప్ప చెవులూ, అందమైన మొహం (ఇది నాది) అందిరికీ కనిపిస్తూనే వున్నాయి. వాటి గురించి కథలెందుకూ, దండగ. లేనివాటి గురించే కథలు రాసినా, పాటలు పాడినాను. దేవదాసు పార్వతి గురించి పాడితే బావుంటుంది గానీ, కుక్క గురించి పాడితే సీపుగా వుంటుంది, బెడ్డిచ్చుకొ్కొడతారు. అందుకని మరి అలాక్కానిచ్చేద్దాం.

అహలు మనకి పుట్టడంలోనే క్రమశిక్షణ ఏడవలేదు. పుట్టాల్సిన తేదీకి పదిరోజులాలీసంగా, మిట్ట మజ్జాన్నం అందరూ తొంగున్న వేళ మెల్లిగా బైటికొచ్చి, మంత్రసానిని "రెండు టీ" చెప్పమన్నాను.

అది "నేను టీ తాగను బాబూ, మీ అమ్మ ఇప్పుడే తాగకూడదు బాబూ" అంది బోసి నోరుతో.

"ఎహె, రెండూ నాకే, ఎల్లి చెప్పు.." అని మళ్ళీ నిద్ర కంటిన్యూ చేసాను.

ఆ సమయంలో గ్రహాలు ఏపనీ చెయ్యకుండా పాను వేసుకుని, పానుపెక్కి తొంగున్నాయి. కోయిలలు, నెమళ్ళు వంటివి ఓ మాటు రెడీ అయ్యి, నన్ను చూసి, "ఈడికింత సీను లేదు" అని కూతలూ గెంతులూ మానేసి, కొమ్మల్లో బజ్జున్నాయి. నేను మెల్లిగా సాయంత్రం లేచాను. అప్పటిదాకా, నేను పోయాననుకుని చచ్చేట్లు కొట్టిన మంత్రసాని అవ్వ, నాలో చలనం చూసి, జడుసుకుని కాసేపు మూర్ఛపోయి లేచింది. టీలు కూడా ఇవ్వలేదు.

నేను గెట్టిగా "టీ, టీ" అని ఏడ్చాను. కాంపౌండర్ని తీసుకొచ్చింది మంత్రసాని. ఆయన కాసేపు శ్రద్ధగావిని, నాకు కావలసినది చప్పున గ్రహించి, ఓ "టీటీ" సూది గుచ్చాడు. "థింగ్స్ హాపెన్" అని నేను భుజాలు ఎగరేసి జన జీవన స్రవంతిలో కలిసిపోయాను. "బాలమ్మతల్లీ, నీ కొడుక్కి బొత్తిగా డిష్టి పైను (డిసిప్లైను) లేదు..." అనేదిట ఆ అవ్వ నా చిన్నతనంలో.

అలా మనం క్రమశిక్షణకి ఏంటోనిం గా పెరిగి ప్రవర్ధమానమౌతున్న రోజుల్లో, ఓ రోజు మేష్టార్ల గ్రహాలు బావుండక నన్ను స్కూల్లో వేసారు. బొటనవేలు చూపించి ఒకసారి, చిటికెన వేలు చూపించి ఓసారి, రెండు వేళ్ళు చూపించి ఓసారి, ప్రతీ క్లాసునుంచీ బైటికొచ్చి, పెద్ద ఉసిరి చెట్టుమీదవాలే కాకులు లెఖ్ఖెడుతున్నాను, ఒకటీ, పన్నెండూ, సున్నా అంటూ.

అప్పుడు నిజంగానే దాహం వేసి, అక్కడ ఉన్న ఒకే ఒక్క గళాసుతో, గుండిగలో నీళ్ళు తీసి కరిచిపెట్టుకుని తాగి, మళ్ళీ అదే గళాసు గుండిగలో ముంచాను.

వెనకాలనించి వచ్చిన సీతమ్మ (మా ఇంట్లో కూడా పని చేస్తుంది) "యేండీ, అలా ఎంగిలి గళాసు ముంచేత్తన్నారు, అల సేత్తే స్కూల్లోంచి తీసేత్తారండి.." అంది కోపంగా.

నేను కూల్ గా సీతమ్మ కేసి తిరిగి "చూడు సీతమ్మా, ఈ స్కూలు కాపోతే ఇంకోటి, ఈ మేష్టరు కాపోతే ఇంకోడు, నువ్వేం బెంగెట్టుకోకు" అన్నాను ముంచడం కంటిన్యూ చేస్తూ.

నా లోకజ్ఞానానికీ, అవగాహనా పటిమకీ అది ఓ గంట మూర్ఛపోయి ఆనక మాయింటికెళ్ళి ఊదేసింది. నన్ను ముంచేసింది. నేను ఇంటికెళ్ళి నా మొదటి రోజు స్కూలు అనుభవాలు చెప్పేలోపులో ఫైరింగు జరిగింది. రాత్రి ఎనిమిదిన్నరకి మళ్ళీ నోట్లో పుల్లగా మజ్జిగా అన్నం తగిలేసరికి స్పృహ వచ్చింది. నా అనుభవాలన్నీ సీతమ్మ ముందస్తుగానే మూడింటికే ఇంట్లో చెప్పేసింది, దానికి బొత్తిగా క్రమశిక్షణలేదని బాధ వేసింది.

అలా అలా మనం ఇంటరు కూడా రాసేసాం. అప్పటికే మన పుణ్యావా అని ఆరుగురు మేష్టార్లు కీర్తిశేషులయ్యారు. ఇంజనీరింగులో వచ్చిన రాంకు బాలేదని, "పోనీ మళ్ళీ మొదట్నించీ చదువుతాను నాన్నగారూ" అన్నాను.

ఆయన ఓ మాటు బెంగగా నావైపు చూసి "వీడు మళ్ళీ ఒకటినించీ మొదలెట్టేట్టున్నాడు" అని భయపడి, చిన్నపొలం అప్పటికప్పుడు అమ్మేసి, అమాంతం నన్ను ఇంజనీరుని చేసేసారు.

"మరిప్పుడు చెల్లి పెళ్ళి ఎలా నాన్నా?" అన్నాను బెంగగా. "నీకు చెల్లెళ్ళు లేరు, దరిద్రుడా, తింగరి పిశాచంగాడా, నిన్నిలాకాదు, ఎవడేనా మంచి సైకియాట్రిష్టుకి చూపిస్తేగానీ దారికి రావు.." అన్నారు కోపంగా.

కట్ చేస్తే డాక్టర్ తామ్ర చూడం ఆఫీసులో వున్నాను. నాకు కాస్త డిసిప్లైన్ నేర్పిస్తే, ఆయనకి పదివేలు ఇస్తానని ప్రామిస్ చేసారట నాన్నగారు. ఆ తామ్ర చూడం గాడు వెధవ పదివేలకి కక్కుర్తి పడి ప్రాణాలమీదకి తెచ్చుకున్నాడు.

వాడు మొదలెట్టాడు "చూడు బాబూ..".

"వన్ మినిట్, నా పేరు శీను, చూడు బాబు కాదు." అన్నాను నమ్మకంగా. వాడికి మొదటి షాక్.

"సరే శీనూ, నీ చిన్నతనంలో అవాంఛనీయ సంఘటనలేవైనా జరిగాయా?" అన్నాడు.

"తెలుగులో తగలడు, ఐ మీన్ చెప్పండి.." అన్నాను నేను.

"ఫర్లేదు, ఏకవచనం ఓకే, ఫ్రెండ్లీగా ఉంటుంది...సరే, నిన్ను ఎవరైనా కొట్టడం గట్రా.." ఆగాడు తామ్ర చూడం.

"రేయ్, కొట్టకపోతే ఎల్లారా? రోజుకి మూడు సార్లు భోజనం తినాలి. పన్నెండు సార్లు దెబ్బలు తినాలి. లేకపోతే లెఖ్ఖలు రావు, నిద్రొస్తుంది..." అన్నాను పళ్ళికిలించి.

వాడు "అద్గదీ సంగతి. పట్టేసాను. సరే, ఇప్పుడు నేనొకటి చెబుతాను, అది వినగానే నీకు ఏది గుర్తొస్తే అది చెప్పాలి సరేనా? " అన్నాడు వాడు.

సరేనన్నాను నేను.

"పులి" అన్నాడు వాడు.

"పులి" అన్నాను నేను.

వాడు ఓ మాటు చిన్నగా నవ్వి "వంతెన" అన్నాడు.

నేను "పులి" అన్నాను.

"ఒయాసిస్సు" అన్నాడు వాడు.

"పులి" అన్నాను నేను.

వాడికి పిచ్చి పీక్ కి చేరుకుంది. నా పీకి పుచ్చుకుని "రేయ్, నన్ను ఏడిపించాలని కాకపోతే, ఒయాసిస్సుకీ, పులికీ ఎక్కడన్నా లింకు ఉందిరా?" అన్నాడు ఆల్మోస్ట్ ఏడుస్తూ.

నేను కళ్ళు బరువుగా మూసి "ఉంది, ఒక పులికి దాహంవేసి అడవిలోంచి, ఎడారిలోకొచ్చింది. అక్కడ ఒయాసిస్సు కనపడింది. దాని దగ్గరకొచ్చింది. అదీ కనెక్షను" అన్నాను.

వాడు అచేతనంగా నాకేసి అతి దీనంగా చూస్తూ, నా చెయ్యి వాడి చెయ్యిలోకి తీసుకుంటూ.."పోనీ ఇంకోసారి ట్రైచేద్దామా" అన్నాడు.

"చెయ్యి" అన్నాను నేను.

“నీకు నాలుగు చాయిస్ లు ఇచ్చి ఒక ప్రశ్న అడుగుతాను. చెప్పాలి. మనం ఏది లేకపోతే బతకలేము గాలి, బెల్టు, వాచీ, సైకిలు" అన్నాడు.

నేను "బంగాళదుంపల వేపుడు" అన్నాను కళ్ళింతింత చేసుకుని. వాడు లోపలికెళ్ళి ఓధర్మా మీటరు తెచ్చుకుని సంకలో పెట్టుకున్నాడు. అది ఢామ్మని పేలిపోయింది.

"చూసావుకాదా, దిక్కుమాలిన పదివేలకి ఆశపడి ప్రాణాలమీదకి తెచ్చుకున్నాను. వెళ్ళిరా నాయనా, వెళ్ళరా నాయనా..." అని నన్ను గెంటేసి సంధిప్రేలాపనలు మొదలెట్టాడు.

నేను బైటికొచ్చి, "నాన్నగారూ, లాభం లేదండీ, వీడికి బొత్తిగా క్రమశిక్షణ లేదు, వీడికి సబ్జెక్టేలేదు, అంతా చాయిస్ లో వదిలేసాట్ట." అనేసి ఇంటికొచ్చేసాను.

ఇంక ఇల్లాకాదని, నన్ను బాగుచేసి నా నడుంవంచే దేశం అమెరికా అని గ్రహించి, ఆ పరీక్షలన్నీ చేయించారు, ఐ మీన్ రాయించారు నాన్నగారు. మద్రాసు కాన్సులేట్ లో బాదం ఖీరు బావుంటుందని మూర్తిగాడు చెప్పటంతో, నాకు వీసాకి వెళ్ళక తప్పింది కాదు.

అక్కడ జేరంగానే, లైనులో నాముందు, వెనకాల, రిక్షావాళ్ళు, టీకొట్టువాళ్ళు, లారీ డ్రైవర్లూ, ఆటో చోదకులూ నిల్చుని వున్నారు. వాళ్ళకి అరవం తప్ప మరో రవం రాదు. అంచేత వీసా మనకే గేరంటీ అని కాలరెగరేసి లోపలికెళ్ళాను. లోపలికెళ్ళేసరికి వాళ్ళంతా మళ్ళీ గ్రాడ్యుయేట్లలాగా, నాకు పోటీ పెళ్ళికొడుకుల్లాగా మారిపోయారు అదేవిటో..

నేను కలలు కన్న క్షణం రానే వచ్చింది. లోపల ఓ పక్కన బాదం ఖీర్ వాడు లేత ఆకుపచ్చ ద్రవాన్ని లోటాడు గాజు గ్లాసులో పోసి, కేవలం మూడువందలకి అమ్మేస్తున్నాడు. నేను నా పేపర్లు, ఫైలు తీసుకుని వాడిదగ్గిరికెళ్ళాను. "మా తాతగారికి వందెకరాలుండేది. దానం ప్లస్ ధర్మం, వెరసి, మా నాన్నగారికి ఒక పెద్ద పొలం, చిన్నపొలం మిగిలాయి. చిన్నపొలం ఈజ్ ఈక్వల్టు నా ఇంజనీరింగు. పెద్దపొలం మేమంతా షేరింగు. ఎంతలేదన్నా నావాటాకి పది లక్షలొస్తాయి. " అంటూంటే అవతల లైన్లోంచి ఒకడొచ్చి, "రేయ్ వీసా కౌంటర్ లో చెప్పాలిరా ఈ మాటలు, ఇక్కడ కాదు" అని నన్ను హెచ్చరించి వెళ్ళిపోయాడు.

నేను వాడి మాటలు బేఖాతరు చేసి కంటిన్యూ అయిపోయాను. " అది బాబూ, మొత్తానికి మంచి మాట చేసుకుని, పది లక్షలకి ఎన్ని బాంద ఖీరులొస్తాయో చూసి, ఇచ్చే మాట చెప్పు" అన్నాను లెఖ్ఖెట్టుకుంటూ.

ఇంతలో పోలీసాడొచ్చి వాణ్ణి పట్టుకుపోయాడు. నేను చేసేది లైక అక్కడ ఒక మూలన కూర్చున్నాను.

ఇంకో తెల్లాడు వచ్చి, "లైన్లో నించో" అని వాడి భాష లో చెప్పాడు.

"అబ్బ ఇప్పుడు రైలు ఆట ఆడే ఓపిక లేదురా, కాసేపు కూచోనీ.." అన్నాను నీరసంగా.

వాడు నన్ను చూసి ముచ్చట పడి ఎత్తుకు తీసుకెళ్ళి వీసా కౌంటర్లో కుదేసాడు.

కౌంటరు వాడు "నువ్వెందుకు అమెరికా వెడుతున్నావు?" అన్నాడు వాడి భాషలో.

"లేకపోతే ఎవరూ పిల్లని ఇవ్వట్లేదు" అన్నాను నేను అదే భాషలో, బెంగగా.

"డబ్బుందా?" అన్నాడు వాడు.

లంచం అడుగుతున్నాడనుకుని వెంట తెచ్చుకున్న రెండు డాలర్లు వాడి చేతిలో పెట్టి "ఇప్పటికి ఇది ఉంచండి" అన్నాను.

వాడు గెట్టిగా నవ్వి "యు ఆర్ ఫన్నీ మేన్..గో పేద ఫీ(జ్) [జ్ సైలెంటు]...." అనేసి లైటార్పేసాడు. నేను వీసా తెచ్చేసుకుని అమెరికా వచ్చేసాను.

ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే రెండు దశాబ్దాలైపోయింది. ఈ పీనుగులకి క్రమశిక్షణా రాహిత్యం నేర్పుతున్నాను. ఇప్పుడిప్పుడే కాస్త ఫలితం కనిపిస్తోంది. మొన్న మొట్ట మొదటి సారి, ఇంగ్లీష్ సినిమా టిక్కెట్లు బ్లాక్ లో అమ్మించాను ఓ పేద్ద థియేటర్ వాడిచేత. లోపలికెళ్ళగానే నాలుగు వరసలు దుప్పట్లు పరిచేయడం కూడా అలవాటైపోయింది వాళ్ళకి. కడిగిన గిన్నెలు డిష్ వాషర్ లో దాచుకోవడం, పాత రాతి యుగం నాటి ఐస్క్రీములన్నీ ఫ్రీజర్ లో అట్టేపెట్టుకోవడం, ఇవన్నీ అలవాటు చేసేసాను. ఇప్పుడు వాళ్ళు లైఫు ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు.

మొన్న ఒక తెల్లావిడ కృతజ్ఞతగా నన్ను శనివారం భోజనానికి పిలిచి మడి కట్టుకుని మావిడికాయ పప్పు, బంగాళ దుంపల వేపుడు, ఇంట్లో తోడిపెట్టిన పెరుగు వేసి భోజనం పెట్టింది.

ఇంకా మన పీనుగలకే ఈ సూక్ష్మం వంట పట్టటం లేదు. ఏదో పేద్ద దొరల్లాగా, ఆరు మీదకి ముల్లు రాకండా ఆఫీసులకి పోవడాలూ, ఆరు మీంచి అన్ని ముళ్ళూ దాటిపోయినా కొంపలకి తగలడకపోడాలూ, వాకింగులూ, బస్కీలు, డైటింగులూ, గోల్ఫులూ గొల్లెద్దాలూ..

ఇవన్నీ చేస్తూ, వెధవది, స్కేలుతో గీసిన గులాపువ్వులాగ ఆ దిక్కుమాల్న జీవితం ఎందుకంట?

మా వూళ్ళో ఆంబోతుండేది. సరిగ్గా పన్నెడింటికల్లా రంకె వేసేది. ఎంత డిసిప్లేనో. ఇదిగో అల్లా తగలడుతోంది జీవితం. మడిసన్నాక్కాత్త ఇండిసిప్లేనుండాల..సెగట్రీ....బొండాలు.... !!

COMMENTS